క్లుప్తంగా

నాణ్యతలోపిస్తే చర్యలు తప్పవు



దామగట్లలో నాడు–నేడు పనులను పరిశీలిస్తున్న జిల్లా మానిటరింగ్ అధికారి లలిత

నందికొట్కూరు రూరల్ : మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో జరుగుతున్న నాడు–నేడు పనుల్లో నాణ్యత లోపిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని నంద్యాల జిల్లా మానిటరింగ్ అధికారి లలిత హెచ్చరించారు. సోమవారం మండల పరిధిలోని దామగట్ల, బిజినవేముల, నాగటూరు గ్రామాలలోని ప్రభుత్వ పాఠశాలల్లో జరుగుతున్న నాడు–నేడు పనులను పరిశీలించారు. అనంతరం నాడు నేడు పాఠశాలల ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లతో సమీక్షా సమావేశం నిర్వహించి పనుల పురోగతి వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఉర్దూ పాఠశాలల మానిటరింగ్ అధికారి యూనస్ బాషా, ఎంఈఓ ఫైజున్నిసా పాల్గొన్నారు.

శ్రీశైలంలో భక్తుల రద్దీ



భక్తులతో కిటకిటలాడుతున్న ఆలయ ప్రధాన క్యూలైన్లు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలమహాక్షేత్రంలో శివుడికి అత్యంత ప్రీతికరమైన సోమవారం నేపథ్యంలో క్షేత్రానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. శ్రీశైలక్షేత్రంలోని పురవీధులు, ఆలయ క్యూలైన్లు కిక్కిరిశాయి. వేకువజామునే పవిత్ర పాతాళగంగలో పుణ్యస్నానాలాచరించుకోవడానికి తరలి రావడంతో పాతాళగంగ స్నానఘట్టాలు భక్తులతో కిటకిటలాడాయి. భక్తుల సౌకర్యార్థం ఆలయాధికారులు క్యూలలో వేచి ఉన్న భక్తులకు మంచినీరు, అల్పాహారాన్ని ఉచితంగా అందజేశారు.

మహానందీశ్వరుడికి పల్లకీసేవ

మహానంది: శ్రీ గంగా, శ్రీ కామేశ్వరీదేవి సమేత మహానందీశ్వరస్వామి వారి ఉత్సవమూర్తులకు శుక్రవారం రాత్రి పల్లకీసేవ వైభవంగా జరిగింది. ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు, అర్చకులు స్వామి, అమ్మవారి ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి, ప్రత్యేక పూజలు చేపట్టారు.

వైభవంగా జ్యోతి మహోత్సవాలు

మహానంది: బండిఆత్మకూరులో వెలిసిన శ్రీ చౌడేశ్వరీదేవి జ్యోతిమహోత్సవ వేడుకలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. లక్షలాది సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేపట్టారు. శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, ఆయన సోదరుడు శిల్పా భువనేశ్వర్‌రెడ్డిలు వేడుకలు హాజరయ్యారు.

ధ్వజ స్తంభ ప్రతిష్ఠ వేడుకలు

మిడుతూరు: మండలపరిధిలోని దేవనూరు మజరా గ్రామం సున్నంపల్లిలో ధ్వజస్తంభ, శ్రీ సుబ్రమణేశ్వర స్వామి, నాభిశిల, కాటమరాజు విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు పురోహితులు వెంకటసుబ్బయ్య శర్మ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా సోమవారం నిర్వహించారు. హోమాలు, విశేష పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు.

సుంకులాపరమేశ్వరీ హోమం



వివిధ వేషధారణలో భక్తులు

జూపాడుబంగ్లా: మండలకేంద్రంలో వెలసిన శ్రీ సుంకులాపరమేశ్వరీదేవి అమ్మవారికి సోమవారం భక్తిశ్రద్ధలతో హోమం నిర్వహించారు. అర్చకులు వేదమంత్రాలు పఠిస్తుండగా భక్తులు నవగ్రహహోమం, లక్ష్మీగణపతిహోమం, సుదర్శనహోమం, సుంకులాపరమేశ్వరి హోమం జరిపించారు. సాయంత్రం పూర్ణాహుతి ఇచ్చారు. అమ్మవారికి గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు పలురకాల వేషాలతో అలరించారు.

సంగమేశ్వరుడి సన్నిధిలో సినీనటి



పూజల్లో సినీనటి సురేఖవాణి

కొత్తపల్లి: సప్తనది సంగమ ప్రాంతంలో వెలసిన సంగమేశ్వరాలయాన్ని సోమవారం సినీనటి సురేఖవాణి ఆమె కూతురుతో కలసి సందర్శించారు. ఆలయ పురోహితులు తెలకపల్లి రఘురామశర్మ ఆమెకు ఆలయ సంప్రదాయాలతో స్వాగతం పలికారు. సంగమేశ్వరాలయం చుట్టు ప్రదక్షిణలు చేసి, వేపధారు శివలింగానికి విశేష పూజలు నిర్వహించుకున్నారు.

నలుగురు పీసీల బదిలీ

మహానంది: మహానంది పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న నలుగురు పోలీసు కానిస్టేబుళ్లు బదిలీ అయ్యారు. ఇటీవల పోలీసుశాఖలో జరిగిన బదిలీల్లో భాగంగా మహానందిలో పనిచేస్తున్న యెహోషువా, స్ఫూర్తిలు కోవెలకుంట్లకు, శ్రీదేవి నంద్యాల దిశ స్టేషన్‌కు, శేషన్న నంద్యాల తాలుకా పోలీస్‌స్టేషన్‌కు బదిలీ అయ్యారు. వారి స్థానంలో ఎవరిని నియమించలేదని తెలిసింది.


జగనన్నకు రుణపడి ఉంటాం



ఈమె పేరు షేక్ షేకూన్‌బీ. నందికొట్కూరు పట్టణంలోని అల్లూరు రోడ్డు చాకలిపేటలో 15 ఏళ్లుగా అద్దె భవనంలో నివాసముంటోంది. ఆమె వ్యవసాయ కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తుంది. సీఎం వైఎస్ జగనన్న పట్టణ సమీపంలోని జగనన్న కాలనీ లేఅవుట్‌లో ఇంటి స్థలం ఇచ్చారు. దీంతో షేక్ షేకూన్‌బీ ఇంటి నిర్మాణం పూర్తి చేసుకుంది. ఉగాది పండుగ రోజు గృహప్రవేశం కూడా చేసింది. ప్రతి నెల రూ, 1800లు బాడుగ చెల్లించేవాళ్లమని, ఇప్పుడు ఆ బాధ తీరిందని, సీఎం జగనన్నకు జీవితాంతం రుణపడి ఉంటామని ఆమె చెబుతున్నారు.



పోత్తిరెడ్డిపాడు లైనింగ్ పనులు జరుగుతున్న దృశ్యం



కేసీ కెనాల్‌కు రెండు పంటలకు నీరు

మే మొదటి వారంలో కేసీ కెనాల్‌లో పారుతున్న నీరు

చరిత్రలో ఎప్పుడు లేని విధంగా కేసీ కెనాల్ ద్వారా ఖరీఫ్, రబీ సీజన్‌లో వేసిన రెండు పంటలకు సాగునీరు జగనన్న ప్రభుత్వం రైతులకు అందిస్తుంది. రైతులు నీటి కోసం ఎలాంటి ఇబ్బందులు పడకుండా రెండు పంటలు అత్యధిక దిగుబడులు సాధిస్తున్నారు.

నవశకానికి నాలుగేళ్లు

- నియోజకవర్గంలో అభివృద్ధి పరుగులు
- గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణాలు
- నందికొట్కూరులో రూ.4 కోట్లతో 30 పడకల ఆసుపత్రి
- రూ.1360 కోట్లతో పోత్తిరెడ్డిపాడు లైనింగ్ పనులు
- కేసీ ఆయకట్టు కింద రెండు కార్లకు పుష్కలంగా నీరు
- నాడు – నేడు పనులతో ప్రభుత్వ పాఠశాలలకు నూతన హంగులు
- 'నవరత్నాలు – పేదలందరికీ ఇల్లు'తో పేదల సొంతింటికల సాకారం



పట్టణంలోని మారుతీనగర్‌లో వేసిన సిమెంట్ రోడ్డు



నందికొట్కూరు పట్టణంలో నిర్మించిన 30 పడకల ఆసుపత్రి

నందికొట్కూరు: సంక్షేమ పథకాలతో రాష్ట్రంలో నవశకానికి నాంది పలికిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి ఈ నెల మే 30వ తేదీ నాటికి నాలుగేళ్లు పూర్తవుతుంది. సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన అనంతరం రెండేళ్ల పాటు కరోనా వెంటాడినా, ఆర్థిక పరిస్థితి సరిగాలేకున్నా ఏమాత్రం వెనకడుగు వేయకుండా ఆయన నేతృత్వంలోని ప్రభుత్వం రాష్ట్రంలో అభివృద్ధికి బాటలు వేసింది. అనేక సవాళ్లు ఎదురైన నవరత్నాలు పథకాలను అమలు చేసిన ఘనత జగనన్న ప్రభుత్వానికే దక్కింది. నాలుగేళ్ల కాలంలో అవినీతికి తావులేకుండా పాలన అందించిన ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం.

మెరుస్తున్న గ్రామీణ రహదారులు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గ్రామాభ్యుదయానికి పెద్ద పీట వేసింది. గ్రామీణ ప్రాంతాల్లో నాలుగేళ్లలో 513 వర్కులకు గాను రూ.14.40 కోట్ల నిధులతో 3,160 మీటర్ల మేర సీసీ రోడ్ల నిర్మాణాలు పూర్తి చేయడంతో గ్రామీణ రహదారులు మిలమిల మెరుస్తున్నాయి. నందికొట్కూరు పట్టణ పరిధిలోని 101 వర్కులకు గాను 68 వర్కులు పూర్తి చేయడం జరిగింది.

అక్కచెల్లెమ్మలకు ఆసరా..

నియోజకవర్గంలో వైఎస్సార్ ఆసరా కార్యక్రమం కింద మూడు విడతలు కలిపి 12,216 మంది అక్క చెల్లెమ్మలకు రూ. 81, 89, 48,088 రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం నేరుగా బటన్ నొక్కి బ్యాంకు ఖాతాల్లో జమ చేశారు. అలాగే జగనన్న ప్రభుత్వం వైఎస్సార్ చేయూత పథకం కింద మూడు విడతల్లో 41, 907 మంది అక్క చెల్లెమ్మలకు బ్యాంకు ఖాతాల్లో రూ.78, 57, 56, 250 వేశారు.

279 స్కూళ్లలో నాడు–నేడు పనులు

నియోజవర్గంలో నాడు–నేడు కింద మొదటి విడతలో 82 స్కూళ్లను ఎంపిక చేసి రూ.19.54 ప్రభుత్వం ఖర్చు చేసింది. రెండోవ విడతలో 197 స్కూళ్లలో నాడు–నేడు పనులు చేపట్టింది. ఇందుకు రూ. 66.43 కోట్ల నిధులను ప్రభుత్వం విడుదల చేసింది. ఇప్పటికే ప్రభుత్వం రూ.18.41 నాడు–నేడు పనులకు ఖర్చు చేసింది.

4,342 మందికి ఇళ్ల పట్టాలు

నియోజకవర్గంలో 73 జగనన్న లేఅవుట్లు ప్రభుత్వం మంజూరు చేసింది. జగనన్న కాలనీలో 4,342 మంది అర్హులైన పేదలకు పట్టాలిచ్చారు. పక్క గృహాలు మంజూరు చేసి రూ. 30.77 కోట్లు నిధులను నిర్మాణాల కోసం విడుదల చేసింది. ఇందులో ఇప్పటికి సుమారు రూ. 15. 69 కోట్ల వరకు ప్రభుత్వం ఖర్చు చేసింది.

వైద్యానికి పెద్ద పీట

పట్టణ, గ్రామీణ ప్రాంతాల ప్రజలకు మరింత మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. నందికొట్కూరు పట్టణంలోని 10 పది పడకల ప్రభుత్వాస్పత్రిని 30 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేస్తూ రూ. 4 కోట్లతో భవనాన్ని నిర్మించారు. దీనిని ఇటీవల ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ ప్రారంభించారు. గతంలో ఇక్కడ వైద్యులు సాధారణ ప్రసవాలు మాత్రమే చేసేవారు. అన్ని హంగులతో నిర్మించిన నూతన ఆసుపత్రిలో కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు ప్రారంభించడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సచివాలయాలతో పాలన భేష్

నియోజకవర్గంలోని గ్రామాల్లో మహాత్మాగాంధీ కన్న కలలను సాకారం చేసేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయాల వ్యవస్థను తెచ్చారు. నియోజకవర్గంలో 71 సచివాలయాలకు రూ. 26.80 కోట్ల నిధులను మంజూరు చేసి నూతన భవనాలను నిర్మించి ప్రభుత్వ సేవలను ప్రజల చెంతకు చేర్చారు.

రైతు భరోసా కేంద్రాలు

గతంలో రైతులు ఎరువులు, విత్తనాల కోసం మండల, నియోజకవర్గాల కేంద్రాలకు వెళ్లి తెచ్చుకునే పరిస్థితి ఉండేది. రైతుల కష్టాలను చూసిన జగనన్న రైతుల కోసం నియోజకవర్గంలోని గ్రామాల్లో 71 రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేశారు. వాటికి రూ, 12. 25 కోట్లతో నూతన భవనాలు నిర్మించారు. ఆర్బీకేల ద్వారా గ్రామంలోనే ఎరువులను, విత్తనాలను ప్రభుత్వమే సరఫరా చేస్తుంది. అంతేకాకుండా పంట దిగుబడులను కూడా విక్రయించేందుకు అవకాశం కల్పించింది.

వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు

పేద రోగులకు మెరుగైన వైద్యం అందించేందుకు జగనన్న ప్రభుత్వం విలేజ్ హెల్త్ కేంద్రాలు గ్రామంలోనే నిర్మించింది. నియోజకవర్గంలో 54 హెల్త్ కేంద్రాలు రూ.10 కోట్లతో నిర్మించారు. అంతేకాకుండా ఫ్యామిలీ డాక్టర్లను ప్రభుత్వం నియమించి ఇళ్ల వద్దకే వచ్చి వైద్యసేవలు అందిస్తుండటంతో రోగులు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

క్రీడలకు పెద్దపీట

రాష్ట్ర ప్రభుత్వ క్రీడలకు పెద్దపీట వేస్తోంది. ఇందులో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో స్టేడియాలు నిర్మిస్తోంది. ఈ మేరకు నందికొట్కూరు పట్టణ కేంద్రంలో ఒకటి, పగిడ్యాల మండలలో ఒక స్టేడియాన్ని ప్రభుత్వం మంజూరు చేసింది. రూ. 2, 30 కోట్లతో నిర్మాణాలను పూర్తి చేయడం జరిగింది.

పోత్తిరెడ్డిపాడు లైనింగ్ పనులు

పోత్తిరెడ్డిపాడు నుంచి బానకచర్ల వరకు లైనింగ్ పనులు జోరుగా జరుగుతున్నాయి. రాయలసీమ ప్రజలకు తాగునీరు, సాగునీరు అందించేందుకు రూ. 1,360 కోట్లు నిధులను ప్రభుత్వం విడుదల చేసింది. పోత్తిరెడ్డిపాడు నుంచి అవుకు వరకు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి.

వైఎస్సార్‌సీపీ పాలన స్వర్ణయుగం

- అభివృద్ధి పథంలో దూసుకువెళ్తున్న శ్రీశైలం నియోజకవర్గం
- ప్రతి మండలంలో అభివృద్ధి పనులు
- నిరుపేదలకు సొంతింటి కల సాకారం
- అన్ని వర్గాల ప్రజల్లో సంతృప్తి



వెలుగోడు సచివాలయం



శ్రీశైలం రింగ్‌రోడ్డు

ఆత్మకూరు: టీడీపీ పాలనలో శ్రీశైలం నియోజకవర్గం అభివృద్ధి అంటే నత్తనడకే. ప్రజా సమస్యలు గాలికి వదిలి సంక్షేమ పథకాలు కేవలం కొందరు వ్యక్తుల చేతుల్లో, అదీ తెలుగుదేశం కార్యకర్తల చేతులకే పరిమితమయ్యేవి. అప్పటి ప్రభుత్వంలో తూతూ మంత్రంగా కూడా అభివృద్ధి జరిగిందిలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టాక ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డి చొరవతో నియోజకవర్గంలో అభివృద్ధి పరుగులు పెడుతోంది. పేదలకు పక్కాగృహాలు, నిరుపేద విద్యార్థులకు అమ్మ ఒడి , విద్యా దీవెన లాంటి పథకాలతో పాటు రైతన్నలకు రైతు భరోసా, అవ్వాతాతలకు ప్రతి నెల 1 వ తేదీనే ఫించన్, సచివాలయాల ద్వారా ఇంటి వద్దకే పథకాలు, సమృద్ధిగా తెలుగు గంగ నీరు, కేసీ కెనాల్, చెరువుల కింద పుష్కలంగా పంటలు. గ్రామీణప్రాంతాల్లో, పట్టణంలో రహదారులు, మంచినీటి సౌకర్యం, శ్రీశైలం, మహానంది దేవస్థానాల్లో అభివృద్ధి పనులు చేపట్టారు. వైఎస్సార్‌సీపీ నాలుగేళ్ల పాలన పూర్తయిన సందర్భంగా ప్రత్యేక కథనం.

అభివృద్ధి పథంలో శ్రీశైలం నియోజకవర్గం

వైఎస్సార్‌సీపీ పాలనలో శ్రీశైలం నియోజకవర్గం అభివృద్ధి వరదలా సాగుతోంది. ఇటీవల శ్రీశైలక్షేత్రంలో రూ.136 కోట్లతో రింగ్‌రోడ్డు ఏర్పాటు, దేవస్థానంలో మహాకుంభోత్సవం లాంటి ఉత్సవాలు, మహానంది క్షేత్రంలో నందిసర్కిల్ ఏర్పాటు లాంటి అభివృద్ధితో ముందుకు సాగగా, సున్నిపెంటను మేజర్ గ్రామపంచాయితీగా ఏర్పాటు చేసిన ఘనత వైఎస్సార్‌సీపీకే దక్కింది. చెంచుగిరిజన గూడేలైన ఎస్ఎస్‌తాండ, బైర్లూటి, కొట్టాలచెర్వు గూడాలు వైఎస్సార్‌సీపీ పాలనలో గ్రామపంచాయతీగా ఏర్పడ్డాయి.

నిరుపేదలకు మంజూరైన గృహాల వివరాలు

మండలం	మంజూరైన గృహాలు	లబ్ధిదారులకు మంజూరైన నిధులు
ఆత్మకూరు	4,200	రూ.75.60 కోట్లు
వెలుగోడు	3,680	రూ.66.24 కోట్లు
బండిఆత్మకూరు	3,176	రూ.57.16కోట్లు
మహానంది	1,574	రూ.28.33 కోట్లు

నెరవేరిన సొంతింటి కల

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టాక నిరుపేదలకు సొంతింటి కల సాధికారత లభించింది. ఆత్మకూరు పట్టణంలోనే 4,200 మందికి పక్కాగృహాలు, ఇంటింటికి కుళాయి కనెక్షన్ల ద్వారా ఇంటింటికి రక్షిత మంచినీటి సౌకర్యం. ఆత్మకూరు లో రూ.3 కోట్లతో నూతన మున్సిపల్ కార్యాలయం, ఆర్టీసీ బస్టాండ్, మార్కెట్‌యార్డ్ గోడౌన్, రైతు భరోసా, వెలుగోడు, బండిఆత్మకూరు , మహానంది మండలాల్లో గోడౌన్ల ఏర్పాటు, అన్ని గ్రామాల్లో రహదారులు ఏర్పాటు చేశారు.

రైతన్నలకు భరోసా

శ్రీశైలం నియోజకవర్గంలోని ఆత్మకూరు,వెలుగోడు, బండిఆత్మకూరు , మహానంది మండలాల్లో వర్షాలు పుష్కలంగా కురవంతో వైఎస్సార్‌సీపీ పాలనలో రైతులు పుష్కలంగా పంటలు పండిస్తూ అధిక దిగుబడి సాధిస్తున్నారు. కేసీ కెనాల్, సిద్ధాపురం ఎత్తిపోతల పథకాలతో అన్నదాతలు రెండు పంటలు సాగుచేస్తున్నారు. అంతేకాకుండా ప్రభుత్వం రైతు భరోసా పథకం కింద సాయం అందజేస్తుండటంతో పెట్టుబడికి ఇబ్బంది లేకుండా పంటలు సాగు చేసుకుంటున్నారు.

సాగుకు రైతు భరోసా నిధులు ఎంతో ఉపయోగం



టీడీపీ ప్రభుత్వంలో రైతులకు ఒక్క రూపాయి కూడా పంట సహాయం అందేదికాదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఖరీఫ్, రబీ సీజన్ ప్రారంభంలో రైతులకు ఏడాదికి రూ.13 వేలు నగదు నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నారు. నాకు ఆత్మకూరు పట్టణ సమీపంలో నాలుగున్నర ఎకరాల పొలం ఉంది. ప్రతి ఏటా పొలం సాగు చేసే సమయానికి మే నెలలో రూ.7,500 నగదు జమ అవుతోంది. దీంతో ట్రాక్టర్లతో చేసే పనులు పూర్తి చేసుకుంటున్నాను. కోత సమయంలోను, విత్తు వేసే సమయంలో రైతులకు ఎంతో ఉపయోగపడేలా రైతు భరోసా నిధులు జమ అవుతున్నాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు.

– షేక్ మహబూబ్‌బాషా, ఆత్మకూరు,

నూతన భవనాలు

ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో గ్రామపంచాయతీలలో గ్రామసచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటు చేసి, వాటికి నూతన భవనాలు నిర్మించారు. నాడు–నేడుతో పాఠశాలల అభివృద్ధి, మండల కేంద్రాల్లో , గ్రామాల్లో ప్రజలు తమ సమస్యలను పరిష్కరించుకుంటూ ప్రభుత్వం అందజేస్తున్న వనరత్న పథకాలను పొందుతున్నారు.

కార్యాలయాల భవన నిర్మాణాలు, మంజూరైన మొత్తం

మండలం	గ్రామ సచివాలయాలు	ఆర్బీకేలు	పాల కేంద్రాలు	మంజూరైన మొత్తం
ఆత్మకూరు	11	11	11	రూ.8.60కోట్లు
బండిఆత్మకూరు	15	15	14	రూ.11.82కోట్లు
వెలుగోడు	13	11	11	రూ.9.46కోట్లు
మహానంది	11	10	01	రూ.6.67కోట్లు



ఇళ్ల స్థలాలను శ్మశానంతో పోల్చడం దారుణం

- చంద్రబాబు వ్యాఖ్యలకు నిరసనగా ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ బైక్ ర్యాలీ
- నాలుగేళ్ల పాలన పూర్తయిన సందర్భంగా సంబరాలు



చాముండి ఫంక్షన్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నాయకులు

నందికొట్కూరు: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం పేదలకు ఇచ్చిన స్థలాలను చంద్రబాబు శ్మశానంతో పోల్చడం దారుణమని ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ అన్నారు. సోమవారం పట్టణ సమీపంలోని ఆత్మకూరు రోడ్డు రబ్బానీ గోడౌన్స్ నుంచి కర్నూలు రోడ్డు చాముండి ఫంక్షన్ హాల్ వరకు ఎమ్మెల్యే ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. చంద్రబాబు డౌన్ డౌన్ అంటూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. నిన్ను నమ్మం బాబు అంటూ నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం చాముండి ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. 14 ఏళ్లు సీఎంగా ఉండి చంద్రబాబు పేదలకు ఒక సెంటూ స్థలం ఇవ్వలేదని మండిపడ్డారు. గతంలో ఇచ్చిన హామీ ఒకటైనా నెరవేర్చా అని ప్రశ్నించారు. చంద్రబాబును ప్రజలు నమ్మే పరిస్థితి లేదని తేల్చి చెప్పారు. వంద శాతం హామీలను అమలు చేసిన ఏకైక సీఎం సీఎం వైఎస్ జగనన్ననేని గుర్తు చేశారు. ప్రజలను మోసం చేసేందుకు చంద్రబాబు మళ్లీ ఉచిత హామీలు మహానాడులో కురిపించడం దారుణమన్నారు. రుణమాఫీతో డ్వాక్రా మహిళలను మోసం చేసిన చరిత్రహీనుడు చంద్రబాబేనని గుర్తుచేశారు. కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ రాష్ట్ర డైరెక్ట్ అబ్దుల్ షకూర్, హౌసింగ్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ రమాదేవి, వడ్డేర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ రామసుబ్బయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ రబ్బానీ, సింగిల్ విండో చైర్మన్ హుసేనయ్య, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు సగినేల రమణ, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి రఘురామయ్య, నాయకులు చౌడయ్య, జీఎండీ రఫి, డాక్టర్ రాజు, వనజ, గోవర్ధన్‌రెడ్డి, బంగారం, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆర్యవైశ్య దివ్య సేవా ధామం ప్రారంభోత్సవం

శ్రీశైలం: క్షేత్ర పరిధిలోని మల్లికార్జున అన్నసత్ర సంఘం ఆధ్వర్యంలో ఆర్యవైశ్య దివ్య సేవా ధామాన్ని సోమవారం పలువురు ప్రముఖులు ప్రారంభించారు. ఆదు రోజుల పాటు వేడుకలు జరగనున్నాయి. కార్యక్రమంలో మాజీ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్, వాణిజ్య సముదాయాల అధ్యక్షుడు దేవకి వెంకటేశ్వర్లు, ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు ముక్కాల ద్వారకానాథ్ పాల్గొన్నారు.

బోరుకు మరమ్మతులు

పాములపాడు: మండలంలోని తుమ్మలూరు ఎస్సీ కాలనీలో బోరుమావిలోని విద్యుత్ మోటారుకు సోమవారం సర్పంచు వరప్రసాద్ మరమ్మతులు చేయించారు. పైపులైన్ పనులు చేపట్టారు.

జలదీక్షను జయప్రదం చేయండి

ఆత్మకూరు/పాములపాడు: రాయల సీమ తాగు,సాగు నీటి విషయంపై సంగమేశ్వరం వద్ద ఈనెల 31న నిర్వహిస్తున్న జలదీక్షను విజయవంతం చేయాలని రాయలసీమ సాగు నీటి సాధన సమితి అధ్యక్షుడు నాగన్న పిలుపునిచ్చారు. పట్టణంలో సోమవారం పోస్టర్లు విడుదల చేశారు. అలాగే పాములపాడులో సామాజిక రాయలసీమ మహాసభ కన్వీనర్ డాక్టర్ నాగన్న పోస్టర్లను ఆవిష్కరించారు.

వలంటీర్లకు సన్మానం

కొత్తపల్లి: మండల పరిధిలోని ముసలిమడుగు గ్రామ సచివాలయంలో జెడ్పీటీసీ సభ్యుడు సోమల సుధాకర్ రెడ్డి, సర్పంచు జమిలాబీ ఆధ్వర్యంలో వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఎంపీటీసీ ముబీనా బేగం, ఉపసర్పంచు బంగి నాగన్న, మాజీ వైస్ ఎంపీపీ మహబూబ్ బాషా పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి
- నాలుగేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనతో రాష్ట్రం అభివృద్ధి
- పట్టణంలో బైక్‌ర్యాలీ నిర్వహించిన ఎమ్మెల్యే, నాయకులు.. కార్యకర్తలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

ఆత్మకూరు: రాష్ట్రంలో పేదల సంక్షేమం వైఎస్సార్‌సీపీతోనే సాధ్యమని ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారం చేపట్టి 4 ఏళ్లు పూర్తయిన సందర్భంగా పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ఏ ప్రభుత్వంలో జరగని అభివృద్ధి వైఎస్సార్‌సీపీ హయాంలో జరిగిందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్న పథకాల ద్వారా ప్రతి నిరుపేద కుటుంబం లబ్ధి పొందేలా పథకాలు మంజూరు చేశారన్నారు. ప్రధానంగా పేదలకు పక్కాగృహాలు, అమ్మ ఒడి, విద్యాదీవెన , విద్యా వసతి , రైతు భరోసా, ఆరోగ్య శ్రీ లాంటి ఎన్నో సంక్షేమ పథకాలు నిరుపేదలకు దక్కుతున్నాయన్నారు.

పట్టణంలో భారీ బైక్‌ర్యాలీ

ఆత్మకూరురూరల్: నిరుపేదలకు ఇస్తున్న ఇళ్లస్థలాలను శ్మశానంతో పోలుస్తు టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు చేసిన వాఖ్యలకు నిరసనగా ఆత్మకూరు పట్టణంలో వైఎస్ఆర్‌సీపీ శ్రేణులు సోమవారం ఆత్మకూరు పట్టణంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి , సమన్వయకర్త శిల్పా భువనేశ్వరరెడ్డి పాల్గొన్నారు. పార్టీ కార్యాలయం నుంచి బైక్ ర్యాలీ ప్రారంభమై కొత్తబస్టాండ్, గౌడ్‌సెంటర్, రంగనాథ్ థియేటర్, నంద్యాల టర్నింగ్ వద్దకు చేరుకున్నారు. నంద్యాల టర్నింగ్‌లో ఎమ్మెల్యే శిల్పా వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పాలాభిషేకం చేసి, పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ, మండల అధ్యక్షులు సయ్యద్‌మీర్, రాజమోహన్‌రెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నాటకాల బాబు.. బూటకాల మ్యానిఫెస్టో

ఆత్మకూరురూరల్: నిత్యం ప్రజలను మోసపుచ్చేందుకు నాటకాలాడే చంద్రబాబు మహానాడులో బూటకపు మ్యానిఫెస్టోను విడుదల చేసి పాతనాటకాన్నే మొదలు పెట్టాడని శ్రీశైలం నియోజకవర్గ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి తీవ్రంగా విమర్శించారు. ఆత్మకూరు పట్టణంలోని వైఎస్ఆర్‌సీపీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2014లో అలవిగాని వాగ్దానాలను మ్యానిఫెస్టోలో పొందుపరచి, ప్రజలను మభ్య పెట్టి అధికారంలోకి వచ్చిన ఆయన తన మ్యానిఫెస్టోను కనీసం ఆన్‌లైన్‌లో కూడా లేకుండా మాయం చేశాడన్నారు. రైతురుణమాఫి, 20 లక్షల ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి వంటి వాగ్దానాలను మ్యానిఫెస్టోలో ఉంచి ఆతరువాత కొన్ని సగం సగంగాను మరికొన్ని ఎత్తివేశారని గుర్తుచేశారు. అయితే జన హృదయనేత వైఎస్ జగన్ 2019లో ఇచ్చిన వాగ్దానాలను నేరవేర్చడమే కాకుండా చెప్పని పథకాలను కూడా అమలు చేసి ప్రజల మన్ననలు పొందారన్నారు.

లోకేష్ గళం మాత్రమే మిగిలింది..

యువగళం అంటూ రోడ్లు పట్టుకు తిరుగుతున్న లోకేశ్ బాబు వెంట యువత లేక పోగా.. పాదయాత్రలో అందరిని తిడుతున్న ఆయన గళం మాత్రమే మిగిలిందని ఎమ్మెల్యే ఎద్దేవ చేశారు. మోసం చంద్రబాబు జన్మహక్కు అని.. దేశంలో నిరుపేదలకు ఇళ్ల పట్టాలు ఇస్తామంటే అడ్డుకునే నాయకుడు ఎవరైనా ఉన్నారంటే అది ఆయనమాత్రమే నని శిల్పా అన్నారు. అమరావతిలో 50,700 ఇళ్ల పట్టాలను పేదలకు ఇస్తుంటే వాటిని కోర్టుల ద్వారా అడ్డుకునేందుకు ప్రయత్నించిన ప్రజాద్రోహి అని విమర్శించారు. ఆయన కడుపు మంటను నయం చేసేందుకు ఎన్ని జెలుసిల్ మాత్రలు చాలవన్నారు. ఆయన ముఖ్యమంత్రిగా ఉండగా 3లక్షల ఇల్లు కూడా ఇవ్వలేక పోయారని నేడు జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం 32 లక్షల ఇళ్ల పట్టాలు ఇవ్వడమే కాకుండా వారికి నూతన గృహాలను నిర్మించి ఇస్తున్నారని చెప్పారు. శుభమా అంటూ నేడో రేపో నిరుపేదలు గృహప్రవేశం చేయబోతుంటే పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాలు శవాలను పూడ్చడానికి కూడా సరిపోవంటూ చంద్రబాబు అశుభాలు పలుకుతున్నారని అన్నారు. జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలను విమర్శిస్తూనే.. అవే పథకాలకు కొత్త పేర్లు పెట్టి మ్యానిఫెస్టో విడుదల చేశారన్నారు. సమావేశంలో వైఎస్ఆర్‌సీపీ నాయకులు శిల్పా భువనేశ్వరరెడ్డి, జి.శింకరరెడ్డి, ఎంపీపీ నల్లకాల్వ తిరుపాలమ్మ, రాజమోహనరెడ్డి, సయ్యద్‌మీర్, పువ్వాడి భాస్కర్, ప్రభాకరరెడ్డి, లాలం రమేష్, తిరిపెం రెడ్డి, సురేష్, సుల్తాన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రహరీ నిర్మాణానికి సహకరించండి

మహానంది: గోపవరంలోని మసీదు చుట్టూ కాంపౌడ్ వాల్ నిర్మాణానికి సహకరించాలని కోరుతూ ముస్లింలు సోమవారం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డిని కలిసి విన్నవించారు. నంద్యాల పట్టణంలోని ఆయన నివాసంలో కలిసి వివిధ సమస్యలపై చర్చించారు. సమస్య పరిష్కారం కోసం తనవంతు కృషి చేస్తానని, సీఎం జగన్‌మోహన్‌రెడ్డితో చర్చించి నిధులు వచ్చేలా ప్రయత్నం చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అనంతరం ముస్లింలు ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, శిల్పా భువనేశ్వరరెడ్డిలను సన్మానించారు. కార్యక్రమంలో టైలర్ మదార్, అంకం హుసేన్‌బాషా, హోటల్ మదార్‌సా, అక్బర్ తదితరులు పాల్గొన్నారు.